సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం । 9 । ఆగస్టు । 2023



ఆదివాసీల అరణ్యరోదన

తాగునీటి కోసం ఏజెన్సీ పల్లెల్లోని ఆదివాసీల తహతహలాడుతున్నారు. మైళ్ల కొద్దీ నడిచి వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. 8లో



'తొలిమెట్టు' లక్ష్యాలను సాధించాలి

తొలిమెట్టు శిక్షణ ద్వారా లక్ష్యాలను సాధించాలని రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బాలమురళి, డీఏఎంఓ నాగ రాజశేఖర్ అన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
34° / 25°

వాతావరణం

జిల్లాలో పలుచోట్ల బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

నేత్రపర్వంగా రామయ్య నిత్య కల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి నిత్య కల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణాన్ని ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవారాన్ని పురస్కరించుకుని అంజనేయస్వామివారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు.

కొత్తగూడెం అభివృద్ధి బాధ్యత నాదే

వనమాతో సీఎం కేసీఆర్



కేసీఆర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వనమా

సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం నియోజకవర్గ అభివృద్ధి బాధ్యత తనదేనని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు హైదరాబాద్ ప్రగతిభవన్‌లో మంగళవారం కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. ముర్రేడు వాగు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. వనమా వెంట ఆయన చిన్న కుమారుడు రామకృష్ణ ఉన్నారు.

'సహకార' అధ్యక్ష పదవి నుంచి తొలగింపు

జూలూరుపాడు: స్థానిక పీఏసీఎస్ అధ్యక్ష పదవి నుంచి లేళ్ల వెంకటరెడ్డిని తొలగిస్తూ వరంగల్ ట్రిబ్యునల్ కోర్టు తీర్పు చెప్పింది. సొసైటీ డైరెక్టర్ యల్లంకి సత్యనారాయణ.. సొసైటీ అధ్యక్షుడిగా కొనసాగుతున్న లేళ్ల వెంకటరెడ్డి ప్రాథమిక సభ్యత్వం, చైర్మన్ పదవిపై అనేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ మూడేళ్ల క్రితం వరంగల్‌లోని తెలంగాణ కో – ఆపరేటివ్ ట్రిబ్యునల్ కోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై కోర్టులో ఇంతకాలం వాదోపవాదాలు కొనసాగగా, చైర్మన్ లేళ్ల వెంకటరెడ్డి సరైన ఆధారాలు కోర్టుకు సమర్పించకపోవడంతో అతడి ప్రాథమిక సభ్యత్వంతో పాటు అధ్యక్ష పదవి నుంచి తొలగిస్తూ కోర్టు సోమవారం తీర్పు వెల్లడించింది. కొత్త చైర్మన్‌ను ఎన్నుకోవాలని జిల్లా కో–ఆపరేటివ్ అధికారిని ఆదేశించింది. వెంకటరెడ్డి రూ.10 వేల జరిమానాను డైరెక్టర్ యల్లంకి సత్యనారాయణకు చెల్లించాలని తీర్పులో పేర్కొందని సత్యనారాయణ తరఫు న్యాయవాదులు పాములపర్తి సదాశివరావు, చల్లా శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కేటీపీఎస్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి



కేటీపీఎస్‌లో పరిశీలిస్తున్న డైరెక్టర్ లక్ష్మయ్య

పాల్వంచ : కేటీపీఎస్ 7వ దశ కర్మాగారంలో విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12వ యూనిట్‌లో ఉత్పత్తి నిలిపివేసి, సీఈ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. బుధవారం ఉదయానికి ఉత్పత్తి పునరుద్ధరించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

కేటీపీఎస్‌లో డైరెక్టర్ పర్యటన

కేటీపీఎస్ 7వ దశ, ఓఅండ్ఎం కర్మాగారాల్లో టీఎస్ జెన్‌కో డైరెక్టర్ (థర్మల్) బాదావత్ లక్ష్మయ్య మంగళవారం పర్యటించారు. కోల్ ప్లాంట్, టర్బయిన్, ట్రాక్ హాపర్, ఓఅండ్ఎం కర్మాగారంలో పాత ప్లాంట్ కూల్చివేత పనులతో పాటు విద్యుదుత్పత్తి నిలిచిపోగా చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. ఆయన వెంట సీఈలు రత్నాకర్, పి.వెంకటేశ్వరరావు, ఎస్ఈలు యుగపతి, రాజ్‌కుమార్, శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు ఉన్నారు.

పాల్వంచ మండలం రెడ్డిగూడెంలో వలస ఆదివాసీ మహిళలు..



అమ్మ.. ఆరోగ్యమేనా?

- ఆదివాసీ మహిళలకు అనారోగ్య సమస్యలు
- ఏళ్లుగా వెంటాడిన రక్తహీనత
- ఇప్పుడిప్పుడే ఆస్పత్రులకు వస్తున్న గిరిజనులు
- చదువు, బాల్యవివాహాల విషయంలో ఇంకా వెనుకబాటే

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒక సమాజం ఎంతమేర అభివృద్ధి చెందిందని గుర్తించడంలో అత్యంత కీలకమైనది మాతాశిశు మరణాల రేటు. అందులోనూ ఊరికి దూరంగా, తాగునీరు, రోడ్డు, కరెంటు కూడా లేని ప్రాంతాల్లో జీవించే ఆదివాసీల్లో మాతాశిశు మరణాలు ఎలా ఉన్నాయనేది ఎంతో ప్రాధాన్యతతో కూడుకున్నది. ఈ విషయంలో వలస ఆదివాసీల పరిస్థితి దారుణంగా ఉండేది. పురిటి నొప్పులతో బాధపడుతున్న మహిళ కుర్చీ లేదా మంచంలో కూర్చుంటే మోసుకెళ్తున్న దృశ్యాలు ఇటీవలి వరకు గోదావరి తీరం వెంట ఉన్న జిల్లాల్లో విరివిగా కనిపించేవి. కొండ కోనలు దిగుతూ, వాగులు వంకలు దాటుతూ గర్భిణులను ఆస్పత్రులకు తీసుకెళ్లేవారు. అదృష్టం కలిసి వస్తే తల్లీబిడ్డలు క్షేమంగా ఇంటికి చేరుకునేవారు. లేదంటే అంతే. అయితే పదేళ్ల క్రితంతో పోలిస్తే వారి ఆరోగ్య పరిస్థితుల్లో సానుకూల మార్పులు వస్తున్నాయి. మైదాన ప్రాంత స్త్రీలతో సమానంగా కాకున్నా ఒకప్పటి గడ్డు పరిస్థితుల నుంచి క్రమంగా బయట పడుతున్నారు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

చిక్కిపోయిన శరీరాలతో..

ఛత్తీస్‌గఢ్‌లో సల్వాజుడుంతో చెలరేగిన హింస కారణంగా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వేలాది మంది ఆదివాసీలు సరిహద్దులు దాటి ఉభయ తెలుగు రాష్ట్రాలకు చేరుకున్నారు. గోదావరి తీరం వెంట అడవుల్లో ఆవాసాలను ఏర్పాటు చేసుకుని సరైన తిండి, బట్ట లేని దారుణ పరిస్థితుల మధ్య జీవితాలను ప్రారంభించారు. ఆ రోజుల్లో ఆదివాసీ గూడేలకు వెళితే పాలిపోయిన ముఖాలు, ఎముకలు తేలిన శరీరాలతో మహిళలు కనిపించేవారు. పిల్లలైతే సన్నటి కాళ్లు, చేతులు, బానపొట్ట, ఎరుపు రంగు జుట్టుతో ఉండేవారు. స్త్రీలకు రక్తహీనత ప్రధాన సమస్యగా ఉండేది. పిల్లలను పోషకాహార లోపం వెంటాడేది. దీంతో మరాస్మస్, క్వాషియోకర్ వంటి వ్యాధులు చిన్నారులను పట్టి పీడించేవి. కానీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, ఎన్జీఓల సహకారంతో క్రమంగా వారి ఆరోగ్య పరిస్థితుల్లో మార్పులు వస్తున్నాయి.

పరిస్థితుల్లో మార్పులు..

ప్రస్తుతం ఆదివాసీ గూడేల్లో బాలికలు కౌమార దశకు రాగానే హిమోగ్లోబిన్ టెస్టులు చేస్తున్నారు. అందులో వచ్చే ఫలితాల ఆధారంగా వారికి సప్లిమెంట్స్ అందిస్తున్నారు. ఇక పెళ్లయిన కొత్త జంటను ఎలిజిబుల్ కపుల్‌గా గుర్తిస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఆశాలు, ఏఎన్ఎంలు ఈ జంటలోని మహిళతో రెగ్యులర్‌గా టచ్‌లో ఉంటున్నారు. నెలసరి తప్పిందని తెలియగానే వెంటనే పరీక్షలు చేయడం, ప్రెగ్నెన్సీ కన్ఫర్మ్ అయితే వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. అప్పటి నుంచి కాన్పు అయ్యే వరకు క్రమంగా ఫాలోఅప్ చేస్తున్నారు. గర్భిణులకు మందులు, పోషకాహారం అందిస్తున్నారు. కాన్పు అయ్యేంత వరకు హెల్త్ వర్కర్లు తోడుగా ఉంటున్నారు. గోదావరికి వరదలు వచ్చే సమయంలో అయితే ముందుగానే గర్భిణులను ఆస్పత్రులకు తరలిస్తున్నారు. గత నాలుగైదేళ్లుగా ఈ విధానం అమలు చేస్తున్నారు. దీని ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. గతంలో ఆదివాసీ గూడేల్లో పది మంది మహిళ్లలో హిమోగ్లోబిన్ 7 పాయింట్లకు పైగా ఉండే వారు ముగ్గురుంటే గొప్పే. కానీ ఇప్పుడు పరిస్థితి మెరుగుపడింది. గతంలో ప్రతీ పది మంది గర్భిణుల్లో ఇద్దరు, ముగ్గురు చనిపోయేవారు. ఇప్పుడు మరణాలు చాలా అరుదుగా చోటు చేసుకుంటున్నాయి.



ఆదివాసీ మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బడికి బాలికలు దూరమే..

ఆదివాసీ కుటుంబాల్లో ఇటీవల బాలురను చదివించే లక్షణం పెరిగింది. హాస్టళ్లలో చదువుతో పాటు పౌష్టికాహారం అందిస్తుండటంతో మగ పిల్లలను పంపేందుకు మొగ్గు చూపుతున్నారు. కానీ బాలికల్లో మాత్రం మార్పు రాలేదు. వారిని చదువు మాన్పించి ఇంటి పనులు అప్పగిస్తున్నారు. ఇక మంచినీటి కోసం బిందెలతో కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. అంతేకాదు నీటి కొరత కారణంగా ప్రతీ రోజు స్నానం వీరికి దుర్లభంగానే మారింది. ఇంకా బాల్య వివాహాలు, కుటుంబ నియంత్రణ విషయంలోనూ ఆదివాసీల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది.

పదహారేళ్లకే తల్లులుగా..

ఆదివాసీల్లో చిన్న వయసులోనే పెళ్లిళ్లు చేసే సంప్రదాయం నేటికీ కొనసాగుతోంది. పదహారేళ్లు వచ్చే సరికి ఇద్దరు, ముగ్గురు పిల్లలకు తల్లులు అవుతున్నవారే ఎక్కువగా ఉంటున్నారు. పైగా కాన్పుల మధ్య సరైన విరామం లేకపోవడంతో చివరగా పుట్టే బిడ్డలు బలహీనంగా ఉండేవారు. ఇక తల్లుల ఆరోగ్య పరిస్థితి అయితే బిడ్డలకు పాలివ్వడమే గగనమయ్యేది. గర్భం దాల్చినప్పటి నుంచి తల్లికి, కడుపులో పెరిగే బిడ్డకు సరైన పోషకాహారం అందివ్వాలి. కానీ పేదరికంతో ఎలాంటి ప్రత్యేక పోషకాహారం మహిళలకు అందేది కాదు. దీనికి తోడు ఆర్థిక పరిస్థితుల కారణంగా తొమ్మిది నెలలు వచ్చే వరకూ ఏదో ఒక పనికి వెళ్లేవారు. ఆస్పత్రులకు వెళ్లాలనే కనీస అవగాహన ఉండేది కాదు. క్షేత్ర స్థాయిలో పని చేసే ఆశాలు, ఏఎన్ఎంలు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించినా అంగీకరించే వారు కాదు. బలవంతంగా తీసుకెళ్లినా మస్కా కొట్టి తిరిగి గూడేలకు చేరుకునేవారు.

మార్పు వస్తోంది



ఆదివాసీ మహిళల్లో ఆరోగ్యం పట్ల స్పృహ పెరుగుతోంది. క్షేత్రస్థాయి వైద్య సిబ్బంది అందించే సలహాలు స్వీకరిస్తున్నారు. వారి ఆరోగ్య విషయాలను కూడా సిబ్బందితో చెబుతున్నారు. దీంతో వారికి అవసరాన్ని బట్టి ఐరన్, విటమిన్ ట్యాబెట్లు ఇస్తూ వారి ఆరోగ్యం మెరుగయ్యేలా జాగ్రత్తలు తీసుంటున్నాం. ఆస్పత్రుల్లో రెగ్యులర్‌గా పరీక్షలు చేయిస్తున్నాం.

– సుశీల, ఏఎన్ఎం, జాతీయ స్థాయి నైటింగేల్ అవార్డు గ్రహీత

రెచ్చిపోతున్న ఇంటి దొంగలు



జీటీపీఎస్ ఆవరణలో పడేసిన స్క్రాప్, ఇనుప చువ్వలు

- జీటీపీఎస్‌లో తరచుగా చోరీలు
- డొల్లగా పవర్ ప్లాంట్ భద్రత
- సీసీ కెమెరాలు ఉన్నా ఫలితం సున్నా
- కేసులతోనే సరి, విచారణపై పట్టింపేది ?

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో బొగ్గు మండటం, టర్బైన్లు తిరగడం, విద్యుత్ ఉత్పత్తి కావడం నిత్యం జరిగే పని. వీటితో పాటే తెరవెనుక మరో పని కూడా ఇక్కడ నిత్యకృత్యమైంది. అదే దొంగతనం. ప్లాంట్ నిర్వహణపై పర్యవేక్షణ కరువవడంతో ఇంటి దొంగలు రెచ్చిపోతూ అందినకాడికి దోచుకుంటున్నారు. తమలో దాగి ఉన్న చోర కళకు ఇక్కడ సాన బెట్టుకుంటున్నారు.

చోరుల వర్క్‌షాప్..!

బీటీపీఎస్ దాదాపు 932 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇందులో ప్రధాన ప్లాంట్ 330 ఎకరాల్లో ఉంది. మిగిలిన స్థలం ప్రస్తుతం ఖాళీగానే ఉంది. ఇందులో కొంతమేరకు గోదాములు, ఇతర నిర్మాణ పనులకు అవసరమైన సామగ్రి నిల్వ ఉంచుతున్నారు. వీటితో పాటు గతంలో నిర్మాణంలో ఉపయోగించగా మిగిలిన ఇనుము, కాపర్, యంత్రాల విడిభాగాలు సైతం ఇక్కడే ఉంటున్నాయి. ఇలా విశాలమైన ప్లాంట్ ఆవరణలో ఉన్న ఇనుము, ఇతర లోహాలు క్రమంగా మాయమవుతున్నాయి. వీటికి సంబంధించి నిత్యం పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదు కావడం పరిపాటిగా మారింది. గత ఏడు నెలల్లో పదుల సంఖ్యలో ఈ తరహా కేసులు నమోదయ్యాయంటే చోరీలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో అర్థమవుతోంది. ఇక్కడి వ్యవహారం చూస్తే చోరుల కోసం సీక్రెట్ వర్క్‌షాప్ కూడా నిర్వహిస్తున్నారా అనే సందేహం కలగకమానదు.

కార్మికులపై కేసులు..

బీటీపీఎస్ ప్లాంట్‌లో చోటు చేసుకుంటున్న చోరీలు, పోలీస్ స్టేషన్లలో నమోదవుతున్న కేసులు పరిశీలిస్తే 90 శాతం రోజువారీ కార్మికుల మీద పెట్టిన కేసులే ఉంటున్నాయి. ప్లాంట్ ఆవరణలో ఇష్టారీతిగా పడి ఉన్న ఇనుప వస్తువులు, ఫెర్రో ఎల్లాయిస్ ఐటెమ్స్‌ను చిన్న మొత్తాల్లో వీరు చోరీ చేసినట్టుగా తేలుతోంది. దీంతో వీరిపై కేసులు నమోదవుతున్నాయి. మరోవైపు కాంట్రాక్టర్లు జీతం ఇవ్వక పోవడంతో ఇబ్బంది పడుతున్నామని, ఈ కష్టాలు తాళలేక కొందరు అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారని కార్మికులు చెబుతున్నారు. ఎప్పటికైనా తమ ఉద్యోగాలు పర్మనెంట్ కాకపోతాయా అనే ఆశతో లక్షల రూపాయలు చెల్లించి కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్నామని, అరకొర జీతంతో పని చేస్తున్నామని అంటున్నారు. ఇప్పుడు కొందరు చేసిన పనికి తమను అనుమానంగా చూడటం సరికాదని కార్మికులు వాపోతున్నారు.

కేసులకే పరిమితం

బీటీపీఎస్ ప్లాంట్‌లో దొంగతనం కేసుల్లో ఆశించిన పురోగతి ఉండడం లేదు. కాపర్ వైర్ చోరీ కేసే ఇందుకు ఉదాహరణ. ప్లాంట్‌లో విద్యుదుత్పత్తి ప్రారంభమైన కొత్తలో రూ.25 లక్షల విలువైన కాపర్ వైర్ చోరీకి గురైంది. ప్లాంట్ ఆవరణలోని గోడౌన్‌లో నిల్వ చేసిన కాపర్ ఉన్నట్టుండి మాయమైంది. అంత భారీ స్థాయిలో కాపర్ తరలించాలంటే కనీసం లారీల వంటి భారీ వాహనాలు ఉపయోగించాలి. ప్లాంట్ చుట్టూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో ఏదో ఒక చోట అయినా ఈ చోరీకి సంబంధించి ఫుటేజీ లభించాలి. దాని ఆధారంగా గత రెండు మూడేళ్లలో దొంగలెవరో తెలిసిపోవాలి. కానీ ఇప్పటికీ ఈ కేసులో ఎలాంటి పురోగతి లేదు. కాపర్ వైరును ఎత్తుకెళ్లిన ఆ దొంగ ఎవరో ఈశ్వరుడికే తెలియాలి అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది.

ఐరన్ కనిపిస్తే అంతే..

ప్లాంట్ నిర్మాణ సమయంలో బాయిలర్లు, కూలింగ్ టవర్లు, చిమ్నీల కోసం ఇనుప రాడ్లను విరివిగా ఉపయోగించారు. నిర్మాణానికి పోను మిగిలిన ఇనుప ముక్కలు ప్లాంట్‌లో చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. వీటిని ఒకచోటకు చేర్చి స్క్రాప్‌గా అమ్మేయడంలో అధికారులు శ్రద్ధ చూపడం లేదు. దీంతో రాడ్లు మాయమవుతున్నాయి. బయట మార్కెట్‌లో 20 ఎంఎం, 50 ఎంఎం రాడ్ల ధర కేజీ రూ. 50 ఉండగా మణుగూరు, పినపాకల దగ్గర ఉన్న పాత ఇనుప దుకాణాల్లో వీటికి కేజీకి రూ.20 నుంచి 30 వరకు చెల్లిస్తున్నారు. దీంతో చిన్న చిన్న ముక్కలుగా ఉన్న ఈ రాడ్లు నిత్యం చోరీకి గురవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం ప్రతీ వారం ఒక్కో పాత ఇనుప సామాన్ల దుకాణం నుంచి మూడుకు తగ్గకుండా స్క్రాప్ లోడ్ లారీలు తరలుతున్నాయి.

'సంక్షేమ' నివేదికలు అందజేయండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

సూపర్‌బజార్(కొత్తగూడెం): బీసీ బంధు, ముస్లిం బంధు దరఖాస్తుల విచారణ నివేదికలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మున్సిపల్ కమిషనర్లను, ఎంపీడీఓలను ఆదేశించారు. ఐడీఓసీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో బీసీ బంధు పథకానికి 13,657 దరఖాస్తులు వచ్చాయని, వాటి ఆధారంగా అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించాలని అన్నారు. అర్హుల జాబితాను ఆయా ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక అధికారుల ధ్రువీకరణతో నివేదికలు అందజేయాలని సూచించారు. లబ్ధిదారులు ఏర్పాటు చేసిన యూనిట్లను ప్రతి మూడు నెలలకు ఒకసారి అధికారులు పరిశీలించాలని ఆదేశించారు. కుల వృత్తిదారులకు ప్రభుత్వం అందించే ఆర్థికసాయం వారి భవిష్యత్‌కు ఎంతగానో దోహదపడుతుందని చెప్పారు. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తులు తీసుకోవాలని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. రెండో దశ దళితబంధు పథకానికి దరఖాస్తులు స్వీకరించాలని, ప్రతిరోజు నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

కొత్తగా మూడు పోలింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలు

జిల్లాలో మూడు నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ఎన్నికల సంఘానికి ప్రతిపాదనలు పంపినట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. ఐడీఓసీలో మంగళవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ముసాయిదా ఓటరు జాబితా ఈనెల 21న ప్రకటిస్తామని, అక్టోబర్ 4న తుది ఓటరు జాబితా ప్రకటిస్తామని చెప్పారు. జిల్లాలో 1,092 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిలో శిథిలావస్థకు చేరిన వాటిని మార్చేందుకు పినపాక నియోజకవర్గంలో 2, ఇల్లెందులో ఒకటి, కొత్తగూడెంలో 11, అశ్వారావుపేటలో 4, భద్రాచలం నియోజకవర్గంలో 8 కేంద్రాలను గుర్తించి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. 1350 కంటే అధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనంగా మూడు కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపామని తెలిపారు. వీటిలో భద్రాచలంలో 2, కొత్తగూడెంలో ఒకటి ఉన్నాయన్నారు. ప్రతి కేంద్రంలో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, దివ్యాంగులు, వయోవృద్ధులకు ర్యాంపులు ఉండాలన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం తహసీల్దార్ ప్రసాద్, నాయకులు లక్ష్మణ్ అగర్వాల్, నోముల రమేష్(బీజేపీ), ఎం.ధర్మారావు(కాంగ్రెస్), సాబీర్ పాషా(సీపీఐ), సత్యనారాయణ(సీపీఎం), కొండస్వామి(టీడీపీ), పాపారావు దొర(ఆప్) పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

డిస్ట్రిక్ట్ పారామీటర్లలో ముందుండాలి

డిస్ట్రిక్ట్ పారామీటర్స్‌లో జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉంచాలని కలెక్టర్ ప్రియాంక ఆల వైద్యారోగ్య శాఖ సిబ్బందికి సూచించారు. ఐడీఓసీలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. సిబ్బంది హాజరు బయోమెట్రిక్ విధానంలో ఉండాలని, దాని ప్రకారమే వేతనాలు చేయాలని చెప్పారు. బయోమెట్రిక్ లేనిచోట డ్రాయింగ్ ఆఫీసర్లు తప్పుడు అటెండెన్స్ ఇస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం వ్యాధులు ప్రబలే కాలమని, అత్యవసర మందులు, వైద్యసిబ్బంది అందుబాటులో ఉండాలని చెప్పారు. తాను ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు ఆస్పత్రులు అపరిశుభ్రంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ జేవీఎల్ శిరీష, డిప్యూటీ డీఎంహెచ్ఓలు సుకృత, రాజ్‌కుమార్, కొత్తగూడెం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ కుమారస్వామి, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, డీసీహెచ్ రవిబాబు, ఎంసీహెచ్ సరళ పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎస్పీకి విశేష స్పందన

కొత్తగూడెంటౌన్: ఎస్పీ డాక్టర్ వినీత్ మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ ఎస్పీ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లా వ్యాప్తంగా 19 మంది బాధితులు ఫోన్ ద్వారా తమ సమస్యలను వివరించారు. ఇందులో భూతగాదా సమస్యలు 6, వ్యక్తిగత విషయాలు 4, సాధారణ సమస్యలు 3, చీటింగ్ కేసులు 5, లోన్ యాప్‌నకు సంబంధించినవి 1 ఉన్నాయని ఎస్పీ వినీత్ వివరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు సిఫార్సు చేశామని తెలిపారు.

ప్రమోషన్లు బాధ్యతను పెంచుతాయి

హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్లు పొందిన 19 మందిని ఎస్పీ వినీత్ మంగళవారం అభినందించారు. పదోన్నతులు పొందిన వారు ఎస్పీ కార్యాలయంలో మంగళవారం వినీత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పదోన్నతులు బాధ్యతను మరింతగా పెంచుతాయని అన్నారు. పోలీస్ శాఖలో నిజాయితీగా పని చేసే వారికి ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) టి.సాయిమనోహర్, పదోన్నతులు పొందిన రవి, రామకోటేశ్వరావు, రామనాథం, రాంబాబు, సురేష్, ఇంద్రలాల్, వాంకుడోతు రవి, యేసు, రాజేష్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.



పదోన్నతి పొందిన కానిస్టేబుళ్లతో ఎస్పీ వినీత్

అకౌంట్స్ ఆఫీసర్ పరీక్ష ప్రశాంతం

సుజాతనగర్/పాల్వంచ : మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌లో ఖాళీగా ఉన్న అకౌంట్స్ ఆఫీసర్ ఉద్యోగాలకు టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. సుజాతనగర్ లోని అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాల, పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. సుజాతనగర్ కేంద్రంలో 131 మందికి ఉదయం సెషన్‌లో 59 మంది, మధ్యాహ్నం పరీక్షకు 61 మంది మాత్రమే హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు. పాల్వంచ కేంద్రంలో 120 మందికి 69 మంది హాజరు కాగా, 51 మంది గైర్హాజరయ్యారు. ఈ కేంద్రంలో నిర్వహించిన పరీక్షలను అదనపు కలెక్టర్ రాంబాబు పరిశీలించారు.

'పల్లెప్రగతి'లో నిర్లక్ష్యం తగదు

అదనపు కలెక్టర్ మధుసూదన్‌రాజు

పాల్వంచరూరల్ : పల్లె ప్రగతి పనుల్లో పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ జి.మధుసూదన్‌రాజు హెచ్చరించారు. మండల పరిధిలోని చంద్రాలగూడెం, రేగులగూడెం, బంజర, మల్లారం, ఉల్వనూరు గ్రామపంచాయతీలను మంగళవారం ఆయన తనిఖీ చేశారు. పల్లెప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలు, నర్సరీలతోపాటు పంచాయతీ కార్యాలయాల్లో రికార్డులు, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బరపటి వాసుదేవరావు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పలు పంచాయతీల్లో డీపీఓ పర్యటన..

మండలంలోని కోడిపుంజులవాగు, రెడ్డిగూడెం, పాండురంగాపురం, తవిశలగూడెం గ్రామపంచాయతీ కార్యాలయాలను డీపీఓ రమాకాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేసి పారిశుద్ధ్య పనుల వివరాలపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. ఆయిన వెంట మండల పంచాయతీ అధికారి బి.నారాయణ తదితరులు ఉన్నారు.



బంజరలో పరిశీలిస్తున్న మధుసూదన్‌రాజు

క్లుప్తంగా

ఆడిట్ అధికారిపై కలెక్టర్‌కు ఫిర్యాదు

చుంచుపల్లి: గతంలో వేర్వేరు చోట్ల పనిచేసిన ఇద్దరు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల విషయంలో ఆడిట్ నిర్వహించిన అధికారి చక్రవర్తిపై మంగళవారం వంశీకృష్ణ, రేష్మా బేగం అనే జూనియర్ కార్యదర్శులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమను మానసిక వేధింపులతో పాటు కించపరుస్తూ మాట్లాడుతున్నారని ఆరోపించారు. ఆతడిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌తో పాటు డీపీఓకు విన్నవించారు.

100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి(సీహెచ్‌సీ)ని 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సివిల్ పనులు, పరికరాలు, సౌకర్యాల కోసం రూ.37.50 కోట్ల నిధులు కూడా కేటాయించారు. సీహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావును కోరగా ఆయన సానుకూలంగా స్పందించి ఈ మేరకు జీఓ విడుదల చేయించారు. దీంతో మంత్రికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

‘సర్పంచ్‌పై చర్య తీసుకోవాలి’


సమావేశానికి హాజరైన అసోసియేషన్ సభ్యులు

చుంచుపల్లి: ఖమ్మం డివిజన్ కారేపల్లి రేంజ్ తాళ్లగూడెం సెక్షన్ అధికారి, అటవీ అధికారులపై దాడి చేసి గాయపరచిన చీమలపాడు సర్పంచ్ కిషోర్‌పై పీడీ యాక్ట్‌తో పాటు రౌడీ షీట్ ఓపెన్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం బాధ్యులు మంగళవారం ఉన్నతాధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు బాగ్యా నాయక్, రామకృష్ణ, గోవిందు, నరేష్, రాంసింగ్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై దృష్టి పెట్టాలి

గురుకుల కార్యదర్శి డాక్టర్ నికోలస్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డేవిడ్ రాజ్

భద్రాచలంఅర్బన్ : వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నందున గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని రాష్ట్ర గురుకుల కార్యదర్శి డాక్టర్ నికోలస్ అన్నారు. మంగళవారం ఆయన హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. విద్యార్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే దగ్గరలోని పీహెచ్‌సీల్లో చికిత్స చేయించాలని, అవసరమైతే డీఎంహెచ్‌ఓను సంప్రదించి ప్రతి గురుకులంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా నుంచి పాల్గొన్న ఆర్సీఓ డేవిడ్‌రాజ్ మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ అయినందున ఇప్పటికే అన్ని గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు.


క్రీడా ప్రాంగణాలకు సామగ్రి కేటాయింపు

జిల్లాకు చేరిన 730 స్పోర్ట్స్ కిట్‌లు


వివరాలు వెల్లడిస్తున్న పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్ : తెలంగాణా క్రీడా ప్రాంగణాల్లో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించడంలో భాగంగా జిల్లాకు 730 స్పోర్ట్స్ కిట్‌లు చేరుకున్నాయి. మంగళవారం డీవైఎస్‌ఓ కార్యాయలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం, పరంధామరెడ్డి వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 1,387 గ్రామాల్లో గల 681 క్రీడా ప్రాంగణాలతో పాటు కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు, పాల్వంచ మున్సిపాలిటీల్లోని 107 వార్డుల్లో గల 49 క్రీడా ప్రాంగణాలకు ఈ సామగ్రి అందజేస్తామని వివరించారు. ఇప్పటికే ఆయా మండలాల ఎంపీడీఓ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాలకు సామగ్రి తరలించామని చెప్పారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,091

ఆదివాసీ బిడ్డల అరణ్యరోదన

గుక్కెడు నీటి కోసం అవస్థలు

- మైళ్ల దూరం వెళ్తే తప్ప తీరని దాహం
- రెండేళ్ల క్రితమే నిధులు మంజూరు
- అటవీశాఖ అభ్యంతరాలతో 10 గ్రామాల్లో పూర్తికాని పనులు



రాళ్లచెలక వద్ద చెలిమ నీటి కోసం వేచిఉన్న గిరిజనులు, (ఇన్‌సెట్) కావడితో నీరు తెచ్చుకుంటున్న పెద్దకలశ వాసులు

పాల్వంచరూరల్: దేవుడు వరమిచ్చినా, పూజారి కరుణించడం లేదన్నట్లు ఏజెన్సీలో ఆదివాసీ గిరిజనుల పరిస్థితి మారింది. ప్రభుత్వం ఆదివాసీ గూడేల్లో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు నిధులు మంజూరు చేసినా అటవీశాఖ అధికారుల అభ్యంతరాలతో పనులు ముందుకు సాగడం లేదు. ఫలితంగా గుక్కెడు నీటి కోసం ఆదివాసీ గిరిజనులు తల్లాడుతున్నారు. మైళ్ల కొద్దీ దూరం వెళ్లి చెలిమలు, ఇతర వనరుల నుంచి నీళ్లు మోసుకురావాల్సిన దుస్థితి నెలకొంది. నేడు (బుధవారం) ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని ఆదివాసీ గూడేల్లో తాగునీటి ఇక్కట్లపై కథనం..

84 గ్రామాలకు నిధులు

ఆదివాసీలు నివాసముంటున్న గ్రామాలకు కూడా మిషన్ భగీరథ పైపులైన్లు నిర్మించి తాగునీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలో 84 ఆవాసాలకు నీటి సౌకర్యం కల్పించేందుకు రెండేళ్ల క్రితం రూ.1.70 కోట్ల నిధులు కేటాయించింది. అయితే, చాలావరకు గ్రామాల్లో పనులు పూర్తయి నీరు అందుతున్నా... అటవీశాఖ అభ్యంతరాలతో పది ఆదివాసీ గిరిజన గ్రామాల ప్రజలు తాగునీటికి నోచుకోలేదు.

ఎక్కడెక్కడ సమస్యలు...

మారుమూల ప్రాంతం, దట్టమైన అడవిలో గుట్టల మధ్య ఉన్న పాల్వంచ మండలంలోని రాళ్లచెలక, చిరుతానిపాడు, బూసురాయితో పాటు అశ్వారావుపేట మండలంలోని మొద్దులమాడి, పెద్దమిద్య, ఉడుతబండ, రమనక్కపేట కాలనీ, తిమ్మాపూర్, రేగళ్ల, జిల్లేడపోగా ఆదివాసీగూడెల్లో తాగునీటి సమస్య పరిష్కారం కాలేదు. ఆయా గ్రామాల్లో ఛత్తీస్‌గఢ్ నుంచి ఏళ్ల క్రితం వలస వచ్చి నివాసం ఏర్పాటుచేసుకున్న ఆదివాసీలు జీవిస్తున్నారు. రాళ్లచెలక, చిరుతానిపాడు, పెద్దకలస గ్రామాల్లో కలిపి 500 మందికి పైగా గిరిజన జనాభా ఉండగా.. వీరికి రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు జారీ చేయడంతో పాటు ఓటు హక్కు కూడా కల్పించారు. పాల్వంచ మండల కేంద్రానికి 25 కిలోమీటర్ల దూరంలో చిరుతానిపాడు, 35 కి.మీ. దూరంలో రాళ్లచెలక, 40 కి.మీ. దూరంలో బూసురాయి గ్రామాలు ఉంటాయి. ఈ గ్రామాలకు తాగునీటిరు ఇప్పటికీ అందకపోగా.. సరైన రహదారి సౌకర్యం కూడా లేదు. ఇక రేగులగూడెం గ్రామపంచాయతీలోని రాళ్లచెలక గ్రామంలో 150 మందికి పైగా ఆదివాసీ గిరిజనులు నివాసం ఉంటున్నారు. గతంలో ఇక్కడ ఉన్న బోరును కూడా అటవీశాఖ అధికారులు తొలగించారు. దీంతో గ్రామానికి కిలోమీటర్ల దూరంలో ఉన్న వాగుకు వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. అలాగే, బూసురాయిలోని గిరిజనులు ఇదే సమస్య ఎదుర్కొంటున్నారు. తాగునీటి కోసం గ్రామ శివారులో రెండు కి.మీ. దూరంలో గల నీటి కుంటలో బావి నిర్మించుకోగా ఇక్కడ కూడా వేసవిలో అవసరాలకు సరిపడా నీళ్లు లభించవు. దీంతో వాగులు, వంకల్లో చెలిమల నుంచి నీరు తోడుకుని తాగుతూ అనారోగ్యం బారిన పడుతున్నారు. కాగా, బంద్రుగొండ పంచాయతీలోని కొయ్యగట్టు గ్రామంలో రూ.5.50 లక్షల వ్యయంతో సోలార్ పంప్‌షెడ్ ఏర్పాటు చేసినా అదీ పని చేయడం లేదు. ఫలితంగా గ్రామ గిరిజనులు కి.మీ.కు పైగా దూరం వెళ్లి వాగు నీరు తెచ్చుకుంటున్నారు.

అవస్థలు పడుతున్నాం



ఆదివాసీ గ్రామాలకు తాగునీరు లేక గిరిజనులు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు. గ్రామానికి కనీసం ఒక తాగునీటి బోర్ అయినా ఏర్పాటుచేయాలి. ఈ విషయమై ఎన్నిమార్లు కోరినా స్పందించిన నాథులే లేరు. - పూనెం రమేష్, బంజర

మానవత్వంతో వ్యవహరించాలి



ప్రభుత్వం తాగునీటి సౌకర్యం కోసం నిధులు మంజూరు చేసినా అటవీశాఖ అభ్యంతరాలతో ఇక్కట్లు తీరడం లేదు. పిల్లాపాపలతో కలిసి మైళ్ల దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకోవాల్సి వస్తోంది. అటవీ అధికారులు మానవత్వంతో వ్యవహరిస్తేనే మా సమస్యలు తీరతాయి. - సురేష్, చిరుతానిపాడు

అటవీశాఖ అభ్యంతరాలతోనే...



రెండేళ్ల క్రితం మంజూరైన నిధులతో 74 ఆదివాసీ గ్రామాలకు మిషన్ భగీరథ పైపులైన్లు వేసి తాగునీరు అందించాం. మిగతా గ్రామాలు దట్టమైన అటవీ ప్రాంతంలో ఉండడంతో అటవీశాఖ అనుమతులు రాలేదు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తాం. - తిరుమలేష్, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్

తెలంగాణ పక్షాన కేంద్రంపై అవిశ్వాసం

బీఆర్‌ఎస్ లోక్‌సభా పక్షనేత నామ నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: కేంద్రంలోని మోడీ సర్కారుపై తెలంగాణ ప్రజలు విశ్వాసం కోల్పోయారని అందుకే రాష్ట్ర ప్రజల పక్షాన అవిశ్వాస తీర్మానం ఇచ్చామని బీఆర్‌ఎస్ లోక్ సభ పక్షనేత, ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని మణిపూర్‌లో అల్లరను అరికట్టలేకపోవడమే కాక కేంద్ర ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అన్ని అంశాల్లోనూ విఫలమైందని విమర్శించారు. తెలంగాణలోని జిల్లాలకు నవోదయ పాఠశాలలు, మెడికల్ కళాశాలలు మంజూరు చేయలేదని ఆరోపించారు. అయినా రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ఆగకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారని తెలిపారు. కాగా, అవిశ్వాస తీర్మానంపై జరిగే చర్చలో ప్రజల వాణిని వినిపిస్తామని ఎంపీ తెలిపారు.

ఆదివాసీలపై దమనకాండ తగదు


ప్రదర్శనలో పాల్గొన్న నాయకులు

ఇల్లెందు: మణిపూర్ సహా దేశంలోని పలు ప్రాంతాల్లో నేటికీ ఆదివాసీలపై దమనకాండ కొనసాగుతోందని, ఆదివాసీలు తమ మనుగడ కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని పొరహక్కుల సంఘం ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు సింగు ఉపేందర్‌రావు, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు మోకాళ్ల రమేష్, ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.సీతారామయ్య అన్నారు. నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఇల్లెందులో మంగళవారం ర్యాలీ, సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్‌ఎస్‌ఎస్, సంఘ పరివార్ శక్తులు మతాలపై దాడులు చేస్తున్నాయని ఆరోపించారు. కార్పొరేట్ సంస్థలకు ఖనిజ సంపదను కట్టబెట్టే కుట్రలు సాగుతున్నాయని అన్నారు. ప్రపంచ దేశాల ముందు ప్రధాని మోడీ ప్రజాస్వామ్యం గురించి గొప్పగా చెబుతారని, ఆదివాసీ మహిళలను నగ్నంగా నడివీధిలో ఊరేగించటమే ప్రజాస్వామ్యమా అని ప్రశ్నించారు. ఆదివాసీలు తమ మనుగడ, హక్కుల రక్షణ కోసం అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రేళ్ల నాగలక్ష్మి, చింత లాలమ్మ, నోముల భానుచందర్, ఎండీ రాసుద్దీన్, రాంసింగ్, సాంబ, గణేష్, సుగుణ, లింగన్న, వెంకటేష్, కిన్నెర రాజన్న, ముత్తన్న పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె విరమణ


దీక్ష విరమింపజేస్తున్న భాస్కర్‌రావు

దమ్మపేట/అశ్వారావుపేటరూరల్ : గత 34 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె విరమించారు. మంగళవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో రాష్ట్ర కార్మిక జేఏసీ నాయకులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా న్యాయమైన సమస్యలను పరిష్కారిస్తామని మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మెను విరమిస్తున్నామని కార్మికులు తెలిపారు. నిర్ణీత గడువులోగా డిమాండ్లను నెరవేర్చకుంటే తిరిగి ఆందోళన ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. దమ్మపేటలో సీపీఐ నాయకుడు యార్లగడ్డ భాస్కరరావు కార్మికులకు నిమ్మరసం ఇచ్చి సమ్మెను విరమింపజేశారు. అశ్వారావుపేటలో సీఐటీయూ నాయకులు వై.వెంకటప్పయ్య, కేసుపాక నరసింహారావు మాట్లాడుతూ.. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జేఏసీ నేతలతో చర్చలు జరిపి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారని, దీంతో తాత్కాలికంగా సమ్మె విరమిస్తున్నామని తెలిపారు.

జామాయిల్ చెట్ల నరికివేత


నరికివేసిన జామాయిల్ చెట్లు

అశ్వారావుపేటరూరల్: ఓ పట్టా భూమిలో కొంతమంది వ్యక్తులు మంగళవారం జామాయిల్ చెట్లను నరికివేశారు. బాధితుడి కథనం ప్రకారం.. మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన నంమూరి రామారావు అనే గిరిజనేతర రైతుకు ఇదే గ్రామ సమీపంలో రెండున్నర ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో కొన్నేళ్లుగా జామాయిల్ తోట సాగు చేస్తున్నాడు. అయితే ఇది పట్టా భూమి కాదని, గ్రామ కంఠం భూమి అంటూ అదే గ్రామానికి చెందిన సుమారు 20 మంది గిరిజనులు జామాయిల్ చెట్లను పూర్తిగా నరికేశారు. దీనిపై బాధిత రైతు, గ్రామ పెద్దలు కలిసి వారిని అడ్డుకునేందుకు యత్నించగా తామంతా అధికార పార్టీ వాళ్లమని బెదిరించినట్లు బాధితుడు వాపోయాడు. జామాయిల్ చెట్ల నరికివేతతో రూ.80 వేల నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పాడు. ఈ ఘటనపై స్థానిక ఎస్సై శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఫిర్యాదు వచ్చిందని, ఇది సివిల్ విషయం కావడంతో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

బూర్గంపాడు: నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని ఓ పూరిల్లు దగ్ధమైంది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చెక్కా భవానికి చెందిన పూరి గుడిసెకు నిప్పంటుకుంది. ఈ ఘటనలో ఇంట్లోని సామాన్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. సమాచారం అందుకున్న భద్రాచలం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

వాగులో పడి వ్యక్తి మృతి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని అనిశెట్టిపల్లి మొర్రేడు వాగులో ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు పడి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆళ్లపల్లి మండలం సీతానగరానికి చెందిన జోగా రాంబాబు(28) కొంతకాలంగా మద్యానికి బానిసై చిన్న చిన్న చోరీలు చేస్తూ కాలం గడుపుతున్నాడు. తాగుడుకు బానిసై ఈనెల 6న నంబర్ ప్లేట్ లేని ద్విచక్ర వాహనంపై ఇల్లెందు క్రాస్ రోడ్డు నుంచి వస్తుండగా పోలీసులు వాహనాన్ని ఆపే ప్రయత్నం చేయగా రాంబాబు బండితోపాటు పారిపోయాడు. అనిశెట్టిపల్లి వద్ద బైక్ పెట్టి సమీపంలోని వాగులోకి పరుగెత్తుతూ ప్రమాదవశాత్తు అందులో పడి మృతి చెందాడు. రాంబాబు మృతదేహం మంగళవారం వాగులో తేలింది. దుర్వాసన వస్తుండడంతో ఎస్సై సంతోష్.. అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతానికే డాక్టర్‌ను పిలిపించి పోస్టుమార్టం చేయించారు. అనంతరం రాంబాబు బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రాంబాబుపై గతంలోనూ నాలుగు కేసులు ఉన్నాయని చెప్పారు.

పామాయిల్ గెలల ట్రాక్టర్ బోల్తా


బోల్తా పడిన ట్రాక్టర్

అశ్వారావుపేటరూరల్: పామాయిల్ గెలలను తరలిస్తున్న ఓ ట్రాక్టర్ అదుపుతప్పి మంగళవారం బోల్తా పడింది. మండలంలోని అచ్యుతాపురం గ్రామ సమీపంలో ఓ రైతు పొలంలో నుంచి పామాయిల్ గెలలను అశ్వారావుపేట ఫ్యాక్టరీకి తరలిస్తుండగా రామచంద్రాపురం సమీపంలో బోల్తా పడింది. ట్రాక్టర్ డ్రైవర్ బల్లం సురేష్ చెయ్యి విరిగింది. స్థానికులు చిట్టితల్లి అంబులెన్స్‌కు సమాచారం అందించగా, స్థానిక ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లారు.

ఫెర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీ

ఇల్లెందురూరల్ : మండలంలోని మాణిక్యారంలో గల రెండు ఫెర్టిలైజర్ దుకాణాలను వ్యవసాయశాఖ అధికారి సతీష్, కొమరారం ఎస్సై గిరిధర్‌రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. క్రయ విక్రయాల రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ సరిగా లేదని గుర్తించిన అధికారులు వాటిని వెంటనే సరిచేసుకోవాలని సూచించారు. దీనికోసం వారం రోజులపాటు దుకాణంలో క్రయ విక్రయాలు నిలిపివేయాలని ఆదేశించారు.

పాఠశాల భవనం శుభ్రంచేస్తూ కిందపడి మృతి


రత్నకుమార్(ఫైల్)

సత్తుపల్లిరూరల్: పాఠశాల భవనంపై ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి మృతి చెందాడు. మండలంలోని కిష్టాపురానికి చెందిన బొబ్బిలి రత్నకుమార్(42) బేతుపల్లి ప్రాథమిక పాఠశాలలో రోజువారీ పనిచేసేందుకు మంగళవారం వచ్చాడు. ఈక్రమంలో పాఠశాల భవనం పైన పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడడంతో వెంటనే ఉద్యోగులు సీపీఆర్ చేశారు. అంతలోనే 108 వాహనం రాగా సిబ్బంది పరిశీలించి రత్నకుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆయనకు భార్య జ్యోతి, ఒక కుమారుడు, కుమార్తె ఉండగా.. రత్నకుమార్ మృతిపై సందేహాలున్నాయని భార్య చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఘటనాస్థలాన్ని ఏసీపీ రామానుజం, సీఐ మోహన్‌బాబు, ఎంపీడీఓ జయరాం, ఎంఈఓ బి.రాములు పరిశీలించారు.

ఇరువర్గాల మధ్య భూపంచాయితీ

నేలకొండపల్లి: భూతగాదా నేపథ్యాన ఇరువర్గాలు గొడవకు దిగగా ఓ వర్గానికి చెందిన వ్యక్తి బైక్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. మండలంలోని అజయ్ తండాలో కొంత కాలం నుంచి భూపంచాయితీ నడుస్తుంది. ఇందులో ఓ వర్గానికి చెందిన భానుప్రసాద్ రిజిస్ట్రేషన్ ఉందని చెబుతూ పొలంలో కోళ్ల ఫాం నిర్మిస్తుండగా, నిర్మాణం చేపడుతున్న స్థలం తమదని రామారావు వాదిస్తుండడంతో ఘర్షణ తారాస్థాయికి చేరింది. ఈ నేపథ్యాన తేజావత్ సైదులు బైక్‌ను వివాదాస్పదస్థలం వద్ద నిలపగా గుర్తు తెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగలబెట్టారు. ఈమేరకు బాధితుడి ఫిర్యాదుతో ఎస్సై బి.సతీష్ పరిశీలించి వివరాలు ఆరా తీశారు.

హెల్మెట్‌తోనే ప్రాణానికి రక్షణ

- నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు
- ఏఎస్పీ పరితోష్ పంకజ్


మాట్లాడుతున్న ఏఎస్పీ పరితోష్ పంకజ్

భద్రాచలంఅర్బన్ : ప్రమాదం జరిగినప్పుడు వాహనదారుడిని హెల్మెట్ మాత్రమే రక్షిస్తుందని, ఖరీదైన వాహనాన్ని కొనుగోలు చేయగానే సరిపోదని, అందుకు తగ్గట్టు హెల్మెట్ ఉపయోగించాలని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. గత రెండు రోజులుగా భద్రాచలంలో ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ వివరాలను మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని 84 ద్విచక్ర వాహనాలకు 186 చలాన్లు విధించామని, రూ.37,556 ఫైన్లు వేశామని తెలిపారు. అతివేగంతో రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు మృత్యువాత పడుతున్నారని, ఎంతోమంది క్షతగాత్రులవుతున్నారని అన్నారు. నిత్యం డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఎవరూ మద్యం సేవించి వాహనం నడపొద్దని సూచించారు. మైనర్లకు వాహనాలిస్తే తల్లిదండ్రులు, వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ట్రిపుల్ రైడింగ్ చట్టరీత్యా నేరమని, రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రమాదకరమని అన్నారు. రాత్రి సమయాల్లో అతివేగంతో యువకులు ద్విచక్ర వాహనాలను పెద్ద శబ్దాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయని, ఎవరికైనా ఇలాంటి సమస్య ఎదురైతే 8712682109 నంబర్ కు సమాచారం అందించాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. బాలికల కళాశాలల వద్ద షీ టీమ్‌లు ఏర్పాటు చేసి, విద్యార్థినులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో టౌన్ సీఐ నాగరాజు రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘తొలిమెట్టు’ లక్ష్యాలను సాధించాలి


దమ్మపేటలో మాట్లాడుతున్న రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బాలమురళి

సుజాతనగర్/దమ్మపేట : తొలిమెట్టు శిక్షణ ద్వారా లక్ష్యాలను సాధిచాలని కార్యక్రమ రాష్ట్ర రిసోర్స్ పర్సన్ బాలమురళి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగ రాజశేఖర్ అన్నారు. దమ్మపేట మండలం పట్వారిగూడెంలో నిర్వహిస్తున్న తొలిమెట్టు శిక్షణను బాలమురళి, సుజాతనగర్‌లో నాగ రాజశేఖర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బాగా అవగాహన చేసుకుని, విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు, ప్రతిభ వెలికి తీయాలని అన్నారు. ప్రతి విద్యార్థి తెలుగు, ఆంగ్లంలో చదవడం, రాయడంతో పాటుగా గణిత ప్రక్రియలను సరళంగా సాధించేలా బోధన కొనసాగలని సూచించారు. అనుకున్న లక్ష్యాలు సాధించాలంటే ఉపాధ్యాయులకు అందజేసిన పీరియడ్ ప్లాన్ ఆధారంగా బోధిస్తూ పిల్లలతో వర్క్‌బుక్స్‌ను నిరంతరం సాధన చేయించాలని సూచించారు. తద్వారా విద్యార్థుల్లో మౌలిక భాష, గణిత సామర్థ్యాలను వెలికి తీయవచ్చన్నారు. పాఠశాల పని వేళల్లో ఉపాధ్యాయులు మొబైల్ ఫోన్లను వినియోగించవద్దని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో దమ్మపేట ఎంఈఓ కీసర లక్ష్మి, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి జగపతి, ఆర్పీలు కృష్ణార్జునరావు, మంజుశ్రీ, రాంబాబు, ఆనందరావు, సునీత, కోర్స్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

భద్రాచలంటౌన్: మణుగూరు(మిట్టగూడెం)లోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో స్పాట్ ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–23లో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఉత్తీర్ణులైన విద్యార్థులు బీఎస్సీ, ఎంపీసీ, ఎంపీసీఎస్, బీకాం(సీఏ), హెచ్‌ఈపీ, ఈఈపీ గ్రూపులలో చేరేందుకు సీట్లు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 20 వరకు గడువు ఉందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఐదో రోజు రెండు దరఖాస్తులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా అబ్కారీ కార్యాలయంలో మంగళవారం ఐదో రోజు నూతన మద్యం దుకాణాల దరఖాస్తులు రెండు వచ్చినట్టు ఎక్సైజ్ అధికారి జానయ్య తెలిపారు. కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించి, దరఖాస్తుదారులకు ఎంట్రీ పాస్ అందజేశాని చెప్పారు. ఈనెల 4 నుంచి 8 వరకు మొత్తం 25 దరఖాస్తులు వచ్చాయని వివరించారు.

క్లుప్తంగా...



169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి

సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ శాఖలో నాయబ్ తహసీల్దార్లుగా పనిచేస్తున్న 169 మందికి తహసీల్దార్లుగా పదోన్నతి లభించింది. భూపరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) నవీన్‌మిత్తల్ అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన శాఖా పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో నిర్ణయం తీసుకున్నారు. 2016–17 ప్యానెల్ సంవత్సరానికి సంబంధించిన పదోన్నతులకు ఈ కమిటీ ఆమోద ముద్ర వేసింది. కాగా పదోన్నతులు కల్పించడం పట్ల తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) హర్షం వ్యక్తం చేసింది. రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వంగ రవీందర్ రెడ్డి, కె.గౌతమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడు మన్నె ప్రభాకర్, ఉపాధ్యక్షులు కె.నిరంజన్, రమేష్ పాక తదితరులు మిత్తల్‌ను సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్' పుస్తకావిష్కరణ




సాక్షి, హైదరాబాద్: ఉత్తరప్రదేశ్‌లో ప్రాచుర్యం పొందిన బొమ్మల కథ 'అజయ్ టు యోగి ఆదిత్యనాథ్'పుస్తకాన్ని హైదరాబాద్‌లోని ఖైరతాబాద్‌లో ఉన్న ఇంజనీర్స్ ఇండియా భవనంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆవిష్కరించారు. కార్యక్రమానికి ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్, రాజ్యసభ సభ్యుడు జాఫర్ ఇస్లాం, బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షాజియా ఇల్మీ, చిలుకూరు బాలాజీ దేవాలయ పూజారి సీఎస్ రంగరాజన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉత్తరప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ జీవిత చరిత్రపై గతంలో ప్రముఖ రచయిత శంతను గుప్తా 'ది మాంక్ హూ బికేమ్ చీఫ్ మినిస్టర్', 'ది మాంక్ హూ ట్రాన్స్‌ఫార్మ్‌డ్ ఉత్తరప్రదేశ్'అనే రెండు బెస్ట్ సెల్లింగ్ నవలలు రాశారు. ఈ సందర్భంగా రచయిత విలేకరులతో మాట్లాడుతూ 'ఆరుగురు తోబుట్టువులతో జన్మించిన అజయ్ సింగ్ బిష్త్ అనే కుర్రాడు.. అజయ్ గోరఖ్‌నాథ్ మఠానికి చెందిన మహంత్‌గా, తర్వాత పార్లమెంటులో అతిపిన్న వయస్కుడైన సభ్యుడిగా, చివరికి యూపీ సీఎంగా ఎలా ఎదిగాడు అనేదే ఈ పుస్తకం'అని తెలిపారు.

ఆదుకోవడం అంటే ఇలా..

లంక గ్రామాల వరద బాధితులతో ఏపీ సీఎం వైఎస్ జగన్

- నాడు ఫొటో సెషన్‌లా నేతల పర్యటన
- బాధితుల వద్దకు నేరుగా వెళ్లి మాట్లాడేవారు కాదు
- నేడు తక్షణ సాయం అందించాకే జనం మధ్యకు వస్తున్నా



అంబేడ్కర్ కోనసీమ జిల్లా గురజాపు లంకలో వరద తాకిడికి గురైన ఓ ఇంట్లోకి వెళ్లి పరిశీలించి.. బాధితురాలికి భరోసా ఇస్తున్న ఏపీ సీఎం జగన్

సాక్షి అమలాపురం: 'గతంలో చాలాసార్లు వరదలు వచ్చాయి. నాయకులు అప్పటికప్పుడు రావడం, అధికారులంతా వారి చుట్టూ తిరగటం జరిగేది. పేపర్లలో.. టీవీల్లో ఫొటోల కోసం పోజులిచ్చి వెళ్లిపోయేవారు. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలి. కానీ వారు మంచి జరిగిందా లేదా అని చూడలేదు. మన ప్రభుత్వం వచ్చాక ఆ పరిస్థితిని మార్చాం. ప్రతి బాధితునికి సాయం అందుతోంది. నాలుగేళ్లుగా ఈ మార్పు కనిపిస్తోంది. సాయం చేయడం, ఆదుకోవడం అంటే ఇదీ..'అని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గోదావరి వరదల బారిన పడిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మంగళవారం ఆయన పర్యటించారు. ముమ్మిడివరం, పి.గన్నవరం నియోజకవర్గ పరిధిలోని గురజాపులంక, లంకాఫ్ ఠాన్నేల్లంక, కొండుకుదురులంకల్లో బాధితులతో మమేకమయ్యారు. వారి కష్టనష్టాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఇలాంటి ప్రతి సందర్భంలో కలెక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామన్నారు. ప్రజలకు తక్షణ సహాయ కార్యక్రమాలు చేపట్టేందుకు కావాల్సిన డబ్బులు వారి చేతుల్లో పెట్టామని చెప్పారు. వరద నష్టం ఎక్కువా, తక్కువా అని చూడకుండా బాధితులను ఉదారంగా ఆదుకోండని చెప్పామని తెలిపారు. 'ఆయా జిల్లాల్లో కలెక్టర్లకు వారం రోజుల సమయం ఇచ్చాం. ప్రతి గ్రామంలోకి వెళ్లాలని, ప్రతి గ్రామంలో ఉన్న వ్యవస్థను చైతన్యం చేయాలని చెప్పాం. ఆ తర్వాత నేను స్వయంగా వచ్చి బాధితులకు సాయం అందిందీ లేనిదీ చూస్తానని చెప్పాను. నేను వచ్చినప్పుడు నాకు సహాయం అందలేదని ఏ ఒక్కరి నోటి నుంచి రాకూడదు'అని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చానని చెప్పారు. వరదలు వచ్చినప్పుడే మిమ్మల్ని పలకరించేందుకు వస్తే సహాయక చర్యలకు ఆటంకం కలుగుతుందని భావించే ఇలా చేశానని వివరించారు. కష్టాలలో ఉన్నప్పుడు మీ బిడ్డ వేగంగా అదుకుంటాడని పునరుద్ఘాటించారు.

నేరుగా జనం మధ్యకే..

మంగళవారం ఉదయం సీఎం వైఎస్ జగన్ నేరుగా గురజాపులంకకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. ఇలా గోదావరి మధ్యన ఉన్న లంక గ్రామాలకు నేరుగా వచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్ కావడం విశేషం. సాధారణంగా వరదల సమయంలో బాధితులను పరామర్శించేందుకు గతంలో చాలా మంది ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు జిల్లాకు వచ్చారు. అప్పట్లో డివిజన్ కేంద్రమైన అమలాపురం, వరద ప్రభావిత ప్రాంతాల మండల కేంద్రాలలో వరద నష్టంపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ఎంపిక చేసిన బాధితులను పరామర్శించి వెనుదిరిగేవారు. సీఎం జగన్ ఇందుకు భిన్నంగా నేరుగా లంక గ్రామాలలోనే దిగడం.. బాధితులను, పంట నష్టపోయిన రైతులను పరామర్శించడంతోపాటు జరిగిన నష్టాన్ని స్వయంగా వీక్షించడం గమనార్హం. ఐదారు గంటలపాటు లంక వాసులతో సీఎం మమేకమయ్యారు.

మూలధన వ్యయంలో అగ్రభాగాన ఏపీ

ఆస్తుల కల్పన వ్యయంలో అగ్రపథంలో ఆంధ్రప్రదేశ్.. 3 నెలల్లో 40 శాతం వ్యయం



సాక్షి, అమరావతి: ఆస్తుల కల్పనకు ఉద్దేశించిన మూలధనం వ్యయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూలధన వ్యయంపై కాగ్ గణాంకాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో తొలి త్రైమాసికంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40.79 శాతం వ్యయం చేసినట్లు కాగ్ గణాంకాలు తెలిపాయి. దేశంలో మరే రాష్ట్రంలోనూ తొలి త్రైమాసికంలో ఇంత మేర వ్యయం చేయలేదని కాగ్ గణాంకాలు పేర్కొన్నాయి. పలు రాష్ట్రాలు బడ్జెట్‌లో మూలధన వ్యయం కేటాయింపుల్లో ఎంతమేర ఖర్చు చేశాయనే అంశాన్ని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక కూడా వెల్లడించింది. మూలధన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ చేసినంత వ్యయం దేశంలో మరే రాష్ట్రంలోనూ చేయలేదని ఎస్‌బీఐ రీసెర్చ్ నివేదిక పేర్కొంది. బడ్జెట్‌లో మూలధన వ్యయానికి చేసిన కేటాయింపుల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏప్రిల్, మే నెలల్లోనే ఏకంగా 29.70 శాతం వ్యయం చేసిందని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికానికి సంబంధించి కాగ్ గణాంకాలు కూడా మూలధన వ్యయంలో ఆంధ్రప్రదేశ్ మిగతా రాష్ట్రాల కన్నా ముందంజలో ఉన్నట్లు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో మూలధన వ్యయం కింద రూ.31,061 కోట్లు కేటాయింపులు చేయగా ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు రూ.12,669 కోట్లు వ్యయం చేసిందని, ఇది కేటాయింపుల్లో 40.79 శాతమని కాగ్ గణాంకాలు స్పష్టం చేశాయి. ఆంధ్రప్రదేశ్ తరువాత మూలధన కేటాయింపుల్లో ఎక్కువ వ్యయం చేసిన రాష్ట్రాల్లో తెలంగాణ, తమిళనాడు, కేరళ, రాజస్థాన్, మహారాష్ట్ర ఉన్నాయి. మూలధన వ్యయం అంటే నేరుగా ఆస్తుల కల్పన వ్యయంగా పరిగణిస్తారు.

బధిరులకు డిగ్రీ కాలేజీ ఏర్పాటు యోచన

వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో బధిర విద్యార్థులకు ప్రత్యేకంగా డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సీఎం ఆదేశించారని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. మంగళవారం మలక్‌పేట్‌లోని తన కార్యాలయంలో ఖైరతాబాద్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రాజేందర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. బధిరుల డిగ్రీ కాలేజీ ఏర్పాటుతోపాటు తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ...డిగ్రీ కళాశాల ఏర్పాటు కోసం పరిశీలన బృందం చేసిన ప్రతిపాదనలపై వీలైనంత త్వరగా నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. రాష్ట్రంలో బధిరులకు కళాశాల లేనందున వారు విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బధిర విద్యార్థుల కళాశాల ఏర్పాటు కోసం గతంలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందించామని, దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు.

వరదలొస్తే ఏం చేయాలి?

- ఒడిశా, యూపీ, అసోం విధానాల అధ్యయనానికి టెక్నికల్ కమిటీ
- గంగా, బ్రహ్మపుత్ర, మహానది నదుల వరద నివారణ చర్యల పరిశీలన
- కమిటీ నివేదిక ఆధారంగా గోదావరి వరదలపై సర్కారు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: గోదావరి వరదల నుంచి భద్రాచలం పట్టణం, పరిసర గ్రామాలకు రక్షణ కల్పించడంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మహానది, గంగా, బ్రహ్మపుత్ర నదుల వరదల నుంచి లోతట్టు ప్రాంతాలకు రక్షణ కల్పించేందుకు అక్కడ అవలంబిస్తున్న అత్యుత్తమ విధానాలపై అధ్యయనం చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం నీటిపారుదల శాఖ ఇంజనీర్లతో సాంకేతిక కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఈ నెల 16 నుంచి 18 వరకు ఒడిశాలోని మహానది, 20 నుంచి 22 వరకు అస్సాంలోని బ్రహ్మపుత్ర, 29–31 వరకు ఉత్తరప్రదేశ్‌లోని గంగా నదిని సందర్శించి వరద రక్షణ చర్యలను పరిశీలించనుంది. ప్రధానంగా వరద రక్షణ గోడలు నిర్మించాలా? లేక ఇంకేమైనా ప్రత్యామ్నాయాలు ఉన్నాయా? అన్న అంశంపై దృష్టి పెట్టనుంది. వరద రక్షణ గోడల వల్ల ఫలితాలతోపాటు వచ్చే సమస్యలను సైతం కమిటీ అధ్యయనం చేయనుంది. గోదావరి వరద ముంపు ప్రాంతాల్లో రెండు వైపులా గోడలు నిర్మించి స్థానికులకు రక్షణ కల్పించాలని గతంలో తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంది. భద్రాచలం ఆలయం, పర్ణశాల, మణుగూరు భారజల ప్లాంట్ వంటి ముఖ్యమైన కట్టడాలకు మాత్రమే వరద రక్షణ గోడలు నిర్మించాలని, మిగిలిన ముంపు ప్రాంతాల్లోని ఆవాసాలు, గ్రామాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో వరద రక్షణ గోడలకు ప్రత్యామ్నాయంగా ఇతర రాష్ట్రాలు తీసుకున్న చర్యలను టెక్నికల్ కమిటీ పరిశీలించనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా భద్రాచలం వరద రక్షణ గోడల ప్రాజెక్టుపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

వరదల్లో 49 మంది మృతి

హైకోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం మరో నివేదిక

సాక్షి, హైదరాబాద్: పది రోజుల క్రితం కురిసిన వర్షాలు, వరదల కారణంగా రాష్ట్రంలో 49 మంది మరణించినట్లు ప్రభుత్వం హైకోర్టుకు నివేదిక సమర్పించింది. ఇందులో నలుగురు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మరణించారని పేర్కొంది. గత వారంలో ఒక నివేదిక అందజేయగా, ఇప్పుడు మరో నివేదిక అందజేసింది. 'మృతుల కుటుంబానికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ప్రకటించాం. వరదసాయానికి రూ.500 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వరద తీవ్రత ఎక్కువ ఉన్నందున రెండు హెలికాప్టర్లు, 27 పడవల్ని అందుబాటులో ఉంచాం. 655 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించాం. 177 షెల్టర్లు ఏర్పాటు చేసి 12 వేలమందికి ఆశ్రయం కల్పించాం. 10 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, రెండు హెలికాప్టర్లు, రాష్ట్ర అగ్నిమాపక, విపత్తుల శాఖలు వరద బాధితులకు అండగా నిలిచాయి. మొత్తం 548 రోడ్లు దెబ్బతినగా.. వీటిలో 471 రాష్ట్ర రహదారులుండగా, 181 రోడ్లకు మరమ్మతులు జరిగాయి. 774 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం వచ్చింది. 721 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ చేశాం. రోడ్ల మరమ్మతులు, విద్యుత్ వంటివాటిని యుద్ధప్రాతిపదికన పునరుద్ధరిస్తున్నాం'అని రాష్ట్ర విపత్తుల కమిషనర్ బొజ్జా రాహుల్ హైకోర్టుకు తెలియజేశారు. జాతీయ విపత్తుల నిర్వహణ చట్టం కింద ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదంటూ డాక్టర్ చెరుకు సుధాకర్ 2020లో దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ మధ్యంతర అప్లికేషన్(ఐఏ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ ఐఏపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ వినోద్ కుమార్ ధర్మాసనం విచారణ చేపట్టింది.

మొబైల్ ఫోన్ రికవరీలో తెలంగాణ టాప్

సాక్షి, హైదరాబాద్ : చోరీకి గురైన, పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల జాడ కనిపెట్టడంలో దేశంలోనే తెలంగాణ పోలీసు నంబర్‌వన్‌గా నిలిచారు. మొత్తం 67.98% రికవరీతో మొబైల్‌ఫోన్ల జాడను కనిపెట్టి వాటిని సంబంధిత వ్యక్తులకు అందజేసినట్లు సీఐడీ అదనపు డీజీ మహేశ్ భగవత్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన మొబైల్‌ఫోన్లను రికవరీ చేసేందుకు టెలికమ్యూనికేషన్స్ విభాగం రూపొందించిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్‌ను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల పోలీస్‌శాఖలు వినియోగిస్తున్నాయని, ఈ పోర్టల్‌ను ఉపయోగించి మొబైల్‌ఫోన్ల రికవరీలో తెలంగాణ పోలీస్ విభాగం తొలిస్థానంలో నిలిచిందని ఆయన వెల్లడించారు. ఈ ఏడాది ఏప్రిల్ 20 నుంచి ఆగస్టు 07 వరకు మొబైల్ ఫోన్ల చోరీ, పోగొట్టుకోవడంపై తెలంగాణ పోలీసులకు అందిన ఫిర్యాదుల మేరకు 5,038 మొబైల్ ఫోన్లు రికవరీ చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ తర్వాత కర్ణాటక 54.20% రెండో స్థానంలో, 50.90%తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు నిలిచినట్లు మహేశ్ భగవత్ పేర్కొన్నారు.

జిల్లా వార్తలు

17నుంచి శ్రావణ మాసోత్సవం

పాల్వంచరూరల్: మండలంలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయంలో ఈనెల 17నుంచి వచ్చే నెల 15వ తేదీ వరకు శ్రావణ మాసోత్సవ పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 17వ తేదీన శ్రావణ మాస దీక్ష ప్రారంభం కానుండగా, ప్రత్యేక పూజలు, వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈమేరకు భక్తులు పెద్దసంఖ్యలో పూజలకు హాజరుకావాలని ఈఓ కోరారు.

డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఉమాదేవి తెలిపారు. ఫిజికల్ సైన్స్(ఎంపీసీ, ఎంపీసీఎస్, డేటా సైన్స్), లైఫ్ సైన్సెస్(బీజెడ్‌సీ, ఎంబీజెడ్‌సీ, బీజెడ్‌సీఎస్), బీకాం(సీఏ) బీకాం(జనరల్), బీఏ(సీబీసీఎస్) కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ విద్యార్థినులు ధ్రువీకరణ పత్రాలు, రూ.200 ఫీజుతో ఈనెల 20లోగా కళాశాలలో నేరుగా సంప్రదించాలని సూచించారు.

బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

టేకులపల్లి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ వెంటనే విడుదల చేయాలని టీఎస్‌టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ లక్ష్మణ్‌నాయక్ డిమాండ్ చేశారు. టేకులపల్లి హైస్కూల్‌లో జరుగుతున్న ఎఫ్ఎల్ఎస్ శిక్షణ శిబిరంలో మంగళవారం పాల్గొన్న ఆయన ఉపాధ్యాయుల సమస్యలపై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంత ఉపాధ్యాయులకు సంబంధించి ఏహెచ్ఆర్ఏ జీఓ విడుదల చేయాలని, పీఆర్‌సీ నియమించి ఐఆర్‌ను ప్రకటించడమే కాక సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈమేరకు డిమాండ్లతో 12వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాకు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈసమావేశంలో టీఎస్‌టీటీఎఫ్ నాయకులు హత్తీరాం, వాంకుడోత్ రమేష్బాబు, బన్సీలాల్, పూల్సింగ్, గోరియా, బాలాజీ పాల్గొన్నారు.

అపరాలకు ఆమడదూరంలో...

- గణనీయంగా తగ్గుతున్న సాగు విస్తీర్ణం
- లక్ష్యంలో సగం మేర పడిపోయిన పెసర సాగు
- మొత్తానికే కనుమరుగవుతున్న కంది సాగు
- వాణిజ్య పంటల వైపే రైతుల మొగ్గు



మున్నేరు వరదతో ఖమ్మం రూరల్ మండలంలో దెబ్బతిన్న పెసర పైరు

ఖమ్మంవ్యవసాయం: రైతులు అపరాల పంటలు సాగుకు దూరమవుతున్నారు. అనుకూలించని వాతావరణం, ప్రకృతి వైపరీత్యాలు ఇందుకు ఓ కారణంగా కాగా, వాణిజ్య పంటలకు పెరిగిన ప్రాధాన్యత ఇంకో కారణంగా చెబుతున్నారు. ఇలా కారణాలు ఏమైనా అపరాల పంటల సాగు విస్తీర్ణం మాత్రం ఏటేటా గణనీయంగా పడిపోతోంది. వ్యవసాయ రంగంలో చోటు చేసుకున్న మార్పులు, నీటి వనరులు అందుబాటులోకి రావడంతో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకే మొగ్గుచూపుతున్నారు. అపరాల పంటల్లో ప్రధానమైనవి పెసర, కంది. ఇందులో కాల పరిమితి ఎక్కువగా ఉండటంతో కంది పంట క్రమక్రమంగా కనుమరుగవుతోంది. ఇక తక్కువ కాల పరిమితి కలిగిన పెసర సాగుపై రైతులు ఆసక్తి కనబరచటం లేదు. రెండేళ్లుగా పెసర పంట చేతికందే సమయాన అధిక వర్షాలతో నష్టం ఎదురైంది. దీంతో ప్రభుత్వం అపరాల పంటలు సాగు చేయాలని సూచిస్తున్నా... పత్తి, మిర్చి, ఇతర ఉద్యాన పంటలకే ప్రాధాన్యమిస్తున్నారు.

ఖమ్మం జిల్లాలోని కొన్ని మండలాల్లో గత మూడేళ్లలో పెసర సాగు (ఎకరాల్లో)

మండలం	2021	2022	2023
కామేపల్లి	100	13	31
రఘునాథపాలెం	1,209	222	153
కూసుమంచి	554	176	01
నేలకొండపల్లి	252	46	21
తిరుమలాయపాలెం	1,516	344	87
చింతకాని	5,555	2,007	2,702
కల్లూరు	108	20	14
పెనుబల్లి	9	20	00
ఏన్కూరు	60	67	16
వైరా	1,380	911	284

లక్ష్యానికి దూరంలో...

ప్రస్తుత వానాకాలం ఖమ్మం జిల్లాలో అపరాల పంటల సాగు గణనీయంగా తగ్గింది. జిల్లాలో పెసర 21 వేల ఎకరాల్లో సాగవుతుండగా అధికారులు అంచనా వేస్తే 10,125 ఎకరాల్లోనే సాగైంది. పెసర పంట కాలం రకాల ఆధారంగా 70 రోజుల వరకు ఉంటుంది. జూన్ ఆరంభంలో పంట వేస్తే ఆగస్టులో చేతికందుతుంది. కానీ ఆగస్టులో కురుస్తున్న వర్షాలతో పంట దెబ్బ తింటోంది. 2020 సంవత్సరంలో 24,664 ఎకరాల్లో, 2021లో 18,156 ఎకరాల్లో 2022లో 6,869 ఎకరాల్లో సాగు చేసిన పెసర పంట వానలకు దెబ్బతినగా రైతులు నష్టపోయారు. ఇక ఈ ఏడాది జూన్‌లో వర్షాలు లేకపోవటంతో లక్ష్యం మేర పెసర సాగుకు నోచుకోలేదు. కంది పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. పంట సాగు కాలం ఎక్కువ కావటం ఓ కారణం కాగా, ఆశించిన ఆదాయం లేకపోవటంతో రైతులు ఆదరించటం లేదు. 2020లో కంది సాగు విస్తీర్ణం 5,344 ఎకరాలు కాగా 2021లో 2,933, 2022లో 232 ఎకరాల్లో సాగు చేశారు. ఇక ఈసారి కేవలం 211 ఎకరాలకే పరిమితం కావడం గమనార్హం.

మద్దతు ధర ఉన్నా...

పప్పు పంటలకు ఉన్న డిమాండ్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అపరాల పంటలు సాగు చేయాలని అవగాహన కల్పిస్తోంది. పప్పులకు మార్కెట్‌లో ధర కూడా బాగానే పలుకుతోంది. పెసలు, కందులకు ప్రభుత్వం మద్దతు ధర ఆశించిన రీతిలో ప్రకటించింది. పెసర ధర గత ఏడాది రూ. 7,755 కాగా ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం రూ.8,558గా నిర్ణయించింది. కందుల ధర రూ.6,600గా ఉండగా, ఈ ఏడాది మరింత పెరిగింది. అయితే, జిల్లాలో నీటి వనరులు పెరగటంతో అధిక ఆదాయాన్నిచ్చే పంటల సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. మిర్చి, ఇతర వాణిజ్య పంటలతో పాటు ఉద్యాన పంటల సాగుకు రైతులు ప్రాధాన్యమిస్తున్నారు. కంది పంట సాగు కాలం దాదాపు ఆరు నెలలుగా ఉండగా.. ఎకరాకు నాలుగు క్వింటాళ్లకు మించి దిగుబడి రాదు. అంటే ఎకరాకు రూ. 20 నుంచి రూ. 25 వేలకు మించి ఆదాయం రావటం లేదు. ఇదే స్థానంలో మిర్చి వంటి పంటలు సాగు చేస్తే ధర ఆధారంగా కనీసం రూ.1.80 లక్ష వరకు ఆదాయం సమకూరుతుండడంతో రైతులు అటే మొగ్గు చూపుతున్నారు.

ఎలాంటి ప్రయోజనమూ లేదు..



అపరాల సాగుతో ఎంతమాత్రం ప్రయోజనం లేదు. గత ఏడాది రెండెకరాల్లో పెసర సాగుచేస్తే అధిక వర్షాలతో చేతికందకుండా పోయింది. కనీసం పెట్టుబడి కూడా రాలేదు. దీంతో ఈ ఏడాది పెసర సాగు చేయలేదు. అయినా ఈసారి సరైన సమయానికి వానలు కూడా కురవలేదు.

– బానోత్ రామా, బీమరాజుపల్లి తండా, తిరుమలాయపాలెం మండలం

వర్షాభావమూ ఓ కారణమే..



నీటి వనరులు పెరిగిన నేపథ్యాన అపరాలకు బదులు మిర్చి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేస్తున్నారు. అధిక ఆదాయాన్నిచ్చే వాణిజ్య పంటల వైపునకు రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ ఏడాది సమయానికి వానలు కురవక కూడా అపరాల పంటల సాగుకు ప్రాధాన్యం తగ్గింది.

– ఎం.విజయనిర్మల, జిల్లా వ్యవసాయాధికారి, ఖమ్మం

గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్ జైన్
- పలువురు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలకు ఆదేశం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్

భద్రాచలంఅర్బన్: గిరిజన విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరేలా మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల, వసతి గృహాల హెచ్‌ఎంలు, వార్డెన్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదో తరగతి ఉత్తమ ఫలితాలు రావాలంటే చివరలో దృష్టి సారించడం కాకుండా ఇప్పటి నుంచే ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.

బదిలీ, బాధ్యతల నుంచి తొలగింపు

గత ఏడాది పదో తరగతి ఫలితాలు తక్కువగా నమోదైన పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులపై చర్యలకు పీఓ ప్రతీక్ ఆదేశించారు. ఖమ్మం ఏహెచ్ఎస్ హెచ్‌ఎం, ఉపాధ్యాయులను గుండాల ఆశ్రమ పాఠశాలకు బదిలీ చేయడమే కాక ఏసీబీ హెచ్ వార్డెన్, పీపీ ప్రాజెక్ట్ హెచ్‌ఎం రాంబాబును చర్లకు బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన ఖమ్మం ఏసీఎంఓ రాములను ఆ హోదా నుంచి తొలగించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏపీఓ(జనరల్), గురుకులాల ఇన్‌చార్జ్ ఆర్‌సీఓ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు కృష్ణానాయక్, తానాజీ, రమణయ్య, రాములు, నరసింగరావు, తిరుమలరావు, రూపాదేవి, చంద్రమోహన్, అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవానికి హాజరుకండి


ప్రపంచ ఆదివాసీ దినోత్సవం బుధవారం జరగనుండగా కార్యక్రమానికి హాజరుకావాలని పీఓ ప్రతీక్‌జైన్, ఏపీఓ డేవిడ్‌రాజ్‌ను భద్రాద్రి ఆదివాసీ సమితి అధ్యక్షుడు పూనెం కృష్ణ, ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మ కోరారు. ఈమేరకు నాయకులు కొండూరు సుధారాణి, కన్న రాజుతో కలిసి వారు పీఓ, ఏపీఓకు ఆహ్వానపత్రికలు అందజేశారు.

గృహలక్ష్మి దరఖాస్తు గడువు పొడిగించాలి

- ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మంమయూరిసెంటర్: గృహలక్ష్మి పథకం కింద స్థలం ఉండి ఇల్లు లేని నిరుపేదలకు రూ.3లక్షల ఆర్థికసాయం ఇస్తామని ప్రకటించిన రాష్ట్రప్రభుత్వం దరఖాస్తుకు మాత్రం మూడు రోజుల గడువు ఇవ్వడం సరికాదని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. మూడు రోజుల్లో ధృవీకరణ పత్రాలు తీసుకోవడం సాధ్యం కాదని చెప్పారు. ఈమేరకు మరో ఇరవై రోజుల పాటు గడువు పొడిగించడంతో పాటు దరఖాస్తులు స్వీకరించే సమయాన రశీదు ఇచ్చేందుకు ఏర్పాట్లు చేయాలని, లేనిపక్షంలో పోరాటలు చేస్తామని రంగారావు ఓ ప్రకటనలో హెచ్చరించారు.

సంస్థ అభివృద్ధికి పాటుపడాలి



నియామక పత్రాలు అందజేస్తున్న జీఎం బసవయ్య

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగం సాధించిన వారు నీతి, నిజాయితీ, క్రమశిక్షణతో పనిచేస్తూ సంస్థ అభివృద్ధికి పాటుపడాలని జీఎం పర్సనల్(వెల్ఫేర్ అండ్ ఆర్సీ) కట్టా బసవయ్య సూచించారు. మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల పిల్లలకు మంగళవారం ఆయన ఉద్యోగ నియామక పత్రాలు అందజేసి మాట్లాడారు. సింగరేణిలో ఉద్యోగం సాధించడాన్ని అదృష్టంగా భావించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు కె.శ్రీనివాస్‌రావు, సుశీల్‌కుమార్, వరప్రసాద్, అజీజ్, స్వప్నసీల్, సింధుశ్రీ పాల్గొన్నారు.

సైబర్ మోసగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి

- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు

హన్మకొండ: సైబర్ మోసగాళ్ల విషయంలో విద్యుత్ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ ఏ.గోపాల్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. వినియోగదారులకు గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి విద్యుత్ బిల్లు కట్టనందున సరఫరా నిలిపేస్తామని చెబుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అయితే, ఎన్పీడీసీఎల్ నుంచి సిబ్బంది ఎవరు కూడా ఫోన్ చేయరని, మెసేజ్ పంపించరని స్పష్టం చేశారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే మెసేజ్‌ల్లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని తెలిపారు. అలాగే, బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్, డెబిట్, క్రెడిట్ కార్డుల అపరిచితులకు చెప్పకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలని సీఎండీ సూచించారు.